బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. పావుగంట తరువాత ఇద్దరూ బయలుదేరారు.

'ఏమయింది రాగా?' కారు డ్రైవ్ చేస్తూ అడిగేడు.

'వారం రోజుల నుంచీ....వాంతులవుతున్నాయి!'

'వారం రోజుల నుంచీనా?' అదిరిపడ్డాడు రామ్. 'మరి డాక్టర్ దగ్గరకి వెళ్లలేదూ?'

'మీరు వూళ్లో లేరుగా?'

'నేను వూళ్లో లేకపోతే మాత్రం డాక్టర్ దగ్గరకి నువ్వొక్కర్తివే వెళ్లకూడదా?' అని అడగలేదు రామ్.

'కడుపు అప్‌సెట్ అయివుంటుంది.!'

రాగ చురుగ్గా చూస్తూ అంది. 'అంతకంటే మంచి ఊహలు మీకెప్పుడు వచ్చాయి గనుక?'

'ఇందులో చెడు ఊహకేం వుంది?'

"చాలు చాలు! మీతో వాదించే ఓపిక నాకు లేదు. ఆమె ముఖంలో విసుగుదల. రామ్ ఇంక సంభాషణను పొడిగించలేదు.

కారు హాస్పిటల్ ముందు ఆగింది. రామ్ విజిటర్స్ లాంజ్‌లో కూర్చున్నాడు. రాగ అరగంట తరువాత బయటకి వచ్చింది.

'ఏమన్నారు డాక్టర్?' ఆదుర్దాగా అడిగాడు. యూరిన్ టెస్ట్ కిమ్మన్నారు.

'దేనికి?'

'రేపు తెలుస్తుందిగా?' ఆమె ముఖం తిప్పకుంది. ఆమె పెదవులపై మధురమైన మందహాసం!

రామ్ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

'నేను వెళ్లి డాక్టర్‌తో మాట్లాడివస్తాను. నిన్ను అపోలో హాస్పిటల్‌కి తీసికెళ్తాను'

'దేనికి? నాకేమీ ప్రమాదకరమైన జబ్బులేదే?'

'మరి దేనికీ టెస్ట్‌లన్నీ?'

ప్రతి స్త్రీకి వచ్చే సమస్యే ఇది' ఆమె ముఖం తిప్పకుని నవ్వుకుంది.

నువ్వెప్పుడూ నాకు అర్థం కావు!'క్షణం ఆగి అన్నాడు. 'డాక్టర్ టెస్ట్‌లవీ వ్రాసిచ్చినా నువ్వెందుకు సీరియస్‌గా తీసుకోవు?'

'ఇవాళ్టి నుంచి కాదు. ఈ క్షణం నుంచి నేనేదీ సీరియస్‌గా తీసుకోను'

రామ్ ఆమెని చెయ్యి జాపి దగ్గరకి తీసుకున్నాడు.

'నీకేదయినా అయితే నేను భరించలేను రాగా!'

'నేను మరో అరగంటలోనో, గంటలోనో చచ్చిపోతానన్నప్పుడు మీరనవలసిన మాట అది'

'ఛ! ఏం మాటలవి?' అతను చప్పున ఆమె నోరు మూసాడు.

రాగ అతని కళ్లలోకి చూసింది. అక్కడ బాధతో విలవిల లాడుతున్న భావం, సన్నని నీటిపొర ఆమెను కదిలించాయి.

'ఒకసారి కారు ఆపండి!'

'దేనికి?' అతనికి అర్థంకాలేదు.

'నా అనారోగ్యం ఏమిటో చెప్తే మీరు ఆ ఆనందంలో కారు యాక్సిడెంట్ చెయ్యకుండా!'

రామ్ కారు ఆపాడు. రాగ అతని చేతిని పొట్టకి ఆన్చుకుంటూ అంది.

'నా అనుమానం....మన మధ్యకి చిన్న బాబో, పాపో రాబోతున్నారు!'

రామ్ ముఖంలో కొన్ని క్షణాలు రకరకాల భావాలు కదలాడాయి.

'అంతేనా?' తేలిగ్గా అన్నాడు. 'నన్ను సస్పెన్స్‌లో పెట్టి చంపేసావు'

'మీకు ఆనందంగా లేదా?'

'చాలా.....చాలా ఆనందంగా వుంది!' అతని కళ్లలో నీళ్లు. స్వరం ఉద్వేగభరితంగా వుంది. అతను హఠాత్తుగా రాగ భుజాల చుట్టూ చెయ్యి వేసి దగ్గరకి లాక్కున్నాడు. ఆమె తలపై అతని కన్నీళ్లు వర్షిస్తున్నాయి. ఆమె ఆశ్చర్యంగా తల ఎత్తి అతని కన్నీళ్లని చూస్తూ అంది.

'ఈ సంతోష సమయంలో మీ కళ్లల్లో నీళ్లా?'

'నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి' అన్నాడో మహాకవి.

ఇది నా గుండె పగిలి పోయే ఆనందం నుంచి ఉద్భవించిన ఆనందభాష్పాలు. అతను కొద్దిసేపటి తరువాత తేరుకుని ఆమెను వదిలిపెట్టి కారు స్టార్ట్ చేసాడు.

— సశేషం

# ఆడకూతురి ఆశ



ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన హారిక తన హేండ్ బ్యాగ్‌ను టేబుల్‌పై పెట్టి, తన గదిలోకి వెళ్లిపోయి, బెడ్‌పై పడుకొని ఏడ్వసాగింది. ఈ సంఘటనను చూసిన హారిక తల్లి దండ్రులు కంగారుపడిపోతూ "ఏం జరిగిందమ్మా? ఎందుకు అలా ఏడుస్తున్నావు?" అని ప్రశ్నించారు. ఆమె చెప్పలేదు. తన ఏడుపు వేగాన్ని మరింత పెంచింది.

"విషయమేమీ చెప్పకుండా అలా ఏడుస్తా వేం?" అని నిలదీశారు కోపంగా. అయినా ఆమె నుంచి జవాబు లేదు.

"పోనీ మీ ఆఫీసులో ఏదైనా గొడవ జరిగిందా? మీ తిక్క మేనేజర్ ఏమైనా అన్నాడా? లేకపోతే... ఎవర్నయినా ప్రేమించావా! లేక నువ్వు ప్రేమించినవాడు నిన్ను కాదని వేరే ఎవర్నయినా ప్రేమించి మనసిచ్చాడా?" అని ప్రశ్నల వర్షం కురిపించారు.

ఏడుపు వేగం కొంత తగ్గింది. గ్లాసుతో కొన్ని నీళ్ళు తెచ్చి అందించింది హారిక తల్లి. నీళ్ళు మెల్లగా తాగిందామె.

"మీరు ఊహించినవేమీ కాదు నాన్న. నాకూ ఓ అన్నయ్యో, తమ్ముడో ఉంటే బావుండేది" అంది తన పమిటి కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"ఔనమ్మా! బాగానే వుండేది. ఓ అన్నయ్యో, తమ్ముడో నీకు ఉండి ఉంటే నిన్ను ఇలా బాధ పెట్టి, బయట ఉద్యోగం చేయించే వాణ్ణి కాదు. మన పరిస్థితులు నిన్ను ఇలా ఇబ్బంది పెట్టేట్టు చేస్తున్నాయి" అంటూ కంటనీరు పెట్టాడు హారిక తండ్రి.

"మీరు ఏడవకండి నాన్నా!

మా ఆఫీసులో నా కొలీగ్ పార్వతి వాళ్ళ తమ్ముడికి పెళ్లి కుదిరిందట. ఆడపడుచు కట్నం కింద పాతికవేలు ఇస్తున్నారట. ఎంచక్క ఆ డబ్బుతో మోటర్‌బైక్ కొనుక్కుంటోంది. రేపటి నుంచి నాలాగా సిటీబస్ కోసం గంటల తరబడి నిల్చోనవసరం లేదు. నాకూ ఓ అన్నయ్యో, తమ్ముడో ఉంటే బావుండేదన్నది మీకు చేయూత గురించి కాదు. నేనూ ఆడపడుచు కట్నంతో బండి కొనుక్కొని హాయిగా తిరిగేదాన్ని" అంటూ నిట్టూర్చింది. అంతే. ఆమె మాటలు విన్న తల్లి దండ్రులు బిత్తరపోయారు.హారిక కేసి విస్తుపోయి చూశారు.

— గుండాబత్తుల శ్రీనివాస్